
సదాశివపల్లిలో గ్రామస్తుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


శంకరపట్నం: లింగాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

# పథకాలు వివరిస్తూ.. ఓటు అభ్యర్థిస్తూ

- మానకొండూర్ నియోజకవర్గంలో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- మద్దతు ప్రకటిస్తున్న ప్రజానీకం


మానకొండూర్: మండల కేంద్రంలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

మానకొండూర్, నవంబర్ 4: నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణుల ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇందులో భాగంగా శనివారం మానకొండూర్ మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వివరించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోపై అవగాహన కల్పిస్తూ మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించగా, ప్రజలు మద్దతు ప్రకటిస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ మండల ఇన్‌చార్జి దండబోయిన శేఖర్‌ముదిరాజ్, నాయకులు ఉండింటి శ్యాంసన్, గొల్ల శ్రీనివాస్, కొమ్ము రవి, కొట్టె ప్రసాద్ రావు, దామ బాలకృష్ణ, బొజ్జ చంద్రయ్య, పొగాకుల రవీందర్, సాగర్, శ్రీకాంత్, నాగరాజు, రాహుల్, రాము, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

***మానకొండూర్ మండలంలో..***

మానకొండూర్ రూరల్, నవంబర్ 4: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని సదాశివపల్లి, మండలంలోని గంగిపల్లి, ముంజంపల్లి, వన్నారం, శ్రీనివాస్‌నగర్, వెల్ది, అన్నారం, వేగురుపల్లి, కొండపల్కల గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి మూడోసారి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌ను, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, అనుబంధ సంఘాల నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

***శంకరపట్నంలో..***

శంకరపట్నం, నవంబర్ 4: మండలంలోని లింగాపూర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ తరఫున నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్ జిల్లా సభ్యుడు అంతం తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అంతం తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

***గన్నేరువరంలో...***

గన్నేరువరం, నవంబర్ 4: సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంప వెంకన్న అన్నారు. మండలంలోని సాంబయ్యపల్లి, గన్నేరువరం, గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకే ఓటు వేసి రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మన్మోహన్ రావు, ప్రభాకర్, న్యాత సుధాకర్, లక్ష్మణ్, బూర వెంకటేశ్వర్, భగవాన్ రెడ్డి, కర్ణాకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

***తిమ్మాపూర్‌లో..***

తిమ్మాపూర్, నవంబర్4: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. పథకాలు, సంక్షేమం కొనసాగాలంటే కారు గుర్తుపై ఓటువేసి ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

***ఇల్లంతకుంటలో..***

ఇల్లంతకుంట, నవంబర్ 4 : ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ గెలిపించాలని పార్టీ నాయకులు శనివారం మండల కేంద్రంతోపాటు వల్లంపట్ల, ముస్కానిపేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను మూడో సారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్, సర్పంచులు కూనబోయిన భాగ్యలక్ష్మి, కేతిరెడ్డి అనసూయ, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఉప సర్పంచ్ సాదుల్, నాయకులు కూనబోయిన బాలరాజు, కేవీఎన్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస ఉస్మాన్, రాజశేఖర్, రమేశ్, భాస్కర్, రాములు, శ్రీనివాస్, శంకర్, తిరుపతి, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్, మధు మల్లవ్వచ చంద్రకళ తోపాటు తదితరులు ఉన్నారు.


గన్నేరువరంలో చేనేత కార్మికుడిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


ఇల్లంతకుంట: వల్లంపట్లలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎల్ఎండీలో మహిళ ఆత్మహత్య

తిమ్మాపూర్, నవంబర్4: లోయర్ మానేరు జలాశయంలో పడి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామానికి చెందిన పిన్న లలిత(60) శుక్రవారం ఇంట్లో నుంచి ఏమీ చెప్పకుండా వచ్చేసింది. రాత్రి వరకు ఆచూకీ లభించకపోవడంతో కుటుంబసభ్యులు జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఎల్ఎండీ రిజర్వాయర్‌లో మహాత్మానగర్ శివారులో గుర్తుతెలియని మహిళ మృతదేహం కనిపించడంతో ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమెను లలితగా గుర్తించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కరీంనగర్ దవాఖానకు తరలించారు.

## చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తిమ్మాపూర్, నవంబర్ 4: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, అవసరమయ్యే చట్టాలు తెలిసుండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగాన్ని చదవాలని, హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. అలాగే న్యాయవాదులు శ్రీనివాస్, మహేశ్ పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

***రైతు వేదికలో న్యాయ విజ్ఞాన సదస్సు***

గన్నేరువరం, నవంబర్ 4: మండలకేంద్రంలోని రైతు వేదికలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్ హాజరై రైతులు, సాధారణ పౌరుడికి ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఏవో కిరణ్మయి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ అడ్వకేట్ మహేశ్, శ్రీనివాస్, పి.ఎల్.వి. సదానందం, స్థానిక అధికారులు, రైతులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



తిమ్మాపూర్: కేజీబీవీలో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్

## పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు


శంషాబాద్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జీవీఆర్, నాయకులు

మానకొండూర్ రూరల్, నవంబర్ 4: సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని శంషాబాద్, జగ్గయ్యపల్లి గ్రామాల్లో శనివారం పార్టీ మండలాధ్యక్షుడు జడ్పీటీసీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ, పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివరించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఇక్కడ సర్పంచులు డొల్ల రమేశ్, మల్లం దీప-లక్ష్మణ్, దేవ సతీశ్ రెడ్డి, ఉప సర్పంచ్ వ్యాట సంపత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, వివిధ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## రెండో రోజూ నామినేషన్లు నిల్

మానకొండూర్ రూరల్, నవంబర్ 4: మానకొండూర్ నియోజక వర్గానికి రెండో రోజు శనివారం కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కే లక్ష్మీ కిరణ్ తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని సూచించారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి

శంకరపట్నం, నవంబర్ 4: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోష్‌కుమార్ కోరారు. శనివారం మెట్‌పల్లి, లింగాపూర్ గ్రామాల్లో ఎన్నికల్ కోడ్‌పై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాలపై పోలీసుల ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అతిక్రమించే వారిపై ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీంలు, డయల్ 100తో పాటు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికల సందర్భంగా కేసులు నమోదయ్యే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంటుందని హెచ్చరించారు. రౌడీ షిట్ తెరిచే అవకాశాలు కూడా ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన ఆరుగురు వ్యక్తులను ముందస్తు చర్యగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి వెల్లడించారు.

## అలజడులు సృష్టించవద్దు

తిమ్మాపూర్ రూరల్, నవంబర్4: ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అలజడులు సృష్టించవద్దని ఎల్ఎండీ ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి అన్నారు. మండలంలోని పోలంపల్లి గ్రామంలో గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా సద్వినియోగపర్చుకోవాలన్నారు. అలాగే రౌడీషీట్లు, కేసులు ఉన్న వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు, అల్లర్లు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పర్లపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభం

తిమ్మాపూర్ రూరల్, నవంబర్4: మండలంలోని పర్లపల్లి గ్రామంలో నుస్తులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని అధికారులు శనివారం ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు కొనుగోలు కేంద్రాలను రైతుల సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మి మోసపోద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జయశంకర్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి సురేందర్, సొసైటీ సీఈవో ఆంజనేయులు, సిబ్బంది ఆవుల కుమార్, జానీ, హమాలీలు, రైతులు పాల్గొన్నారు.

## సీవోఈ విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, నవంబర్4: మండలంలోని అల్గునూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రంలో టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. 9వ తరగతి విద్యార్థిని స్వప్నకుమారి ప్రథమ స్థానం సాధించగా, పదో తరగతి విద్యార్థినులు ప్రణవీశ్రీ ద్వితీయ, అనన్య తృతీయ సానాల్లో నిలిచారు. వీరితో పాటు పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు సంస్థ ప్రతినిధులు కిరణ్, శ్రీధర్, మనోజ్ సర్టిఫికెట్స్‌తో పాటు బంగారు, వెండి, కాంస్య పతకాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, రాంసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

## కాచాపూర్‌లో కొండ చిలువ కలకలం

శంకరపట్నం, నవంబర్ 4: మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఓ భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. గ్రామ శివారులోని ఇనకొండ సమ్మిరెడ్డికి చెందిన వరి పొలంలో 10 అడుగుల పొడవైన భారీ కొండ చిలువ కనిపించింది. శనివారం మధ్యాహ్నం కోతకు వచ్చిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న సమ్మిరెడ్డి, తదితరులకు పొలంలో భారీ కొండ చిలువ కనిపించడంతో భయభ్రాంతులతో పరుగులు తీశారు. అనంతరం రైతులు, యువకులు పోగై కొండ చిలువను బండ రాళ్లతో కొట్టి చంపడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.